సాక్షి విశాఖపట్నం

మంగళవారం। 8। అక్టోబర్। 2024



సంతానలక్ష్మిగా కనకమహాలక్ష్మి



సంతృప్తికర స్థాయిలో ప్రజా వినతుల పరిష్కారం 10లో



విలాసాల కోసం దొంగతనాలు

విలాసాల కోసం దొంగగా మారిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. 3 బైకులు, 4 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. 10లో

న్యూస్‌రీల్

రైతుబజార్లలో కిలో టమాటా రూ.50



సీతమ్మధార : జిల్లాలోని అన్ని రైతు బజార్లలో మంగళవారం నుంచి కిలో టమాటాలను రూ.50కి విక్రయించనున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.మయూర్ అశోక్ తెలిపారు. ఒక్కో కుటుంబానికి కిలో టమాటాలను మాత్రమే ఇస్తారని పేర్కొన్నారు. ఆధార్ లేదా రేషన్ కార్డు చూపించి టమాటాలను కొనుగోలు చేయవచ్చని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్.కె.యాసిన్ స్పష్టం చేశారు.

జెడ్పీ సీఈవోగా నారాయణమూర్తి బాధ్యతల స్వీకరణ



జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో)గా పి.నారాయణ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు డీఎల్డీవోగా ఉన్న ఈయన కాకినాడ జెడ్పీ సీఈవో(ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పదోన్నతిపై విశాఖ జిల్లా జెడ్పీ సీఈవోగా విచ్చేశారు. జెడ్పీ అధికారులు, సిబ్బంది సీఈవో నారాయణమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

విశాఖపట్నం-శ్రీకాకుళం రోడ్ మధ్య స్పెషల్ రైళ్లు


తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-శ్రీకాకుళంరోడ్ మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-శ్రీకాకుళం రోడ్(08529) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు ఉదయం 10 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్-విశాఖపట్నం(08530) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళం రోడ్‌లో ప్రతీరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి అదే రోజు సాయంత్రం 3.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నడుస్తాయి.

కలెక్టర్‌ను కలిసిన భీమిలి ఆర్డీవో



మహారాణిపేట: భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కె.సంగీత్ మధుర్ సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా భీమిలి ఆర్డీవోగా నియమితులయ్యారు.

మీ వెంటే AI



ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే.. జరిమానా

ఇక ఏఐతో ట్రాఫిక్ చలానాలు

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై కసరత్తు
- వాహనాల నంబర్ ప్లేట్లు ట్రాక్ చేసే కెమెరాల ఏర్పాటుకు చర్యలు
- పైలెట్ ప్రాజెక్టుగా మూడు కంపెనీలకు బాధ్యతలు
- వచ్చే ఏడాది నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు

విశాఖ సిటీ: సిగ్నల్ జంపింగ్.. ట్రిపుల్ రైడింగ్.. హెల్మెట్ ధరించకుండా డ్రైవింగ్.. ఇలా ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలపై రయ్‌రయ్‌మంటూ వెళ్లిపోదామనుకుంటే ఇకపై జేబులకు చిల్లులుపడతాయి. జంక్షన్లలో పోలీసులు లేరు. మనల్ని ఎవరూ చూడడం లేదు అనుకుంటే పొరపాటుపడినట్టే..నిను వీడని నీడలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫాలో అవుతుంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వినియోగించాలని నగర పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. ఒకవైపు ట్రాఫిక్ నిబంధనల అమలుపైనే కాకుండా ముందు ట్రాఫిక్ రద్దీ నియంత్రణ విషయంలో కూడా ఏఐ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆలోచిస్తోంది. ప్రత్యేకంగా ఏఐతో పనిచేసే ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. పైలెట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు మూడు కంపెనీలకు బాధ్యతలు అప్పగించింది.

మూడు కంపెనీలకు బాధ్యతలు

మెట్రో నగరాల్లో అమలవుతున్న ఈ నూతన విధానాన్ని విశాఖలో అమలు చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి నిర్ణయించారు. దీని కోసం కలెక్టర్ హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సహకారం కోరారు. ఇందుకోసం ఏఐ టెక్నాలజీ సంబంధిత కంపెనీలను సంప్రదించారు. మూడు కంపెనీలతో ప్రత్యేకంగా సమావేశమై పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఒక్కో కంపెనీకి రెండు, మూడు జంక్షన్లు కేటాయించారు. అక్కడ ఈ ఏఐ టెక్నాలజీ వ్యవస్థను ఏర్పాటు చేసే బాధ్యతలు అప్పగించారు. అక్కడ అమలు తీరును బట్టి జిల్లా అంతటా ఈ సరికొత్త వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చుకు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్‌ను సీపీ కోరారు.

నంబర్ ప్లేట్‌లు ట్రాక్ చేసేలా..



నిర్దేశిత జంక్షన్లలో 360 డిగ్రీలు పని చేసే ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వాటికి ఏఐ టెక్నాలజీని అనుసంధానిస్తారు. ఇవి వాహనాల నంబర్ ప్లేట్లను ట్రాక్ చేసి ట్రాఫిక్ నిబంధనలు పాటించని పక్షంలో ఆటో మేటిక్‌గానే ఈ-చలానాలను పంపిస్తుంది. ఎంత వేగంగా సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినా సులువుగా నంబర్ ప్లేట్‌ను గుర్తించి ఫైన్లు విధిస్తుంది. దీంతో నిబంధనలు అతిక్రమించే వారి జేబుకు చిల్లులుపడనున్నాయి.

జంక్షన్లలో ఏఐ కెమెరాలు

జిల్లాలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఒకవైపు ట్రాఫిక్ రద్దీ నియంత్రణతో పాటు నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. అయితే ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ ధారణపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కొన్ని జంక్షన్లు, ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వారికి చలానాలు వేస్తున్నారు. అయితే ఇకపై ఇటువంటి మాన్యువల్ విధానానికి స్వస్తి చెప్పి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఇటువంటి వారికి ఫైన్‌లు వేసే విధానాన్ని అమలు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 6,387 సీసీ కెమెరాలు ఉన్నాయి. అందులో ఆయా పరిసరాలను మాత్రం రికార్డు చేస్తున్నాయి. సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి చలానాలు వేసే అవకాశాలు లేవు. కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఈ కెమెరాలు అనుసంధాన మైనప్పటికీ.. అక్కడి నుంచి చూసి ఫైన్లు వేసే పరిస్థితి లేదు. అలాగే ప్రతి జంక్షన్‌లోను తనిఖీలు నిర్వహించేంత సంఖ్యలో ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో వాహనాల నంబర్లను ట్రాక్ చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీసులు నిర్ణయించారు.



కి'లేడి' లీలలు

- ఆమె జాబితాలో మరో బాధితుడు
- కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు

విశాఖ సిటీ: కి'లేడీ' బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈమె వలలో చిక్కిన బాధితుల సంఖ్య పెరుగుతూ పోతోంది. తాజాగా కాఫీ షాప్ నిర్వాహకుడి ఫిర్యాదుతో మరో వ్యవహారం బట్టబయలైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఒక వివాహితుడు రెండేళ్లుగా కాఫీ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆరు నెలల క్రితమే కె.జాయ్ జమీమా, ఆమె స్నేహితురాలితో కలిసి ఆ కాఫీ షాప్‌కు వెళ్లింది. అక్కడ నిర్వాహకుడిని పరిచయం చేసుకుంది. తాను డిజిటల్ మార్కెటింగ్ చేస్తానని, వ్యాపార అభివృద్ధికి తన వద్ద అనేక ఐడియాలు ఉన్నాయని నమ్మించింది. ఇలా తరచూ ఆ షాప్‌కు రావడం ప్రారంభించింది. కొద్ది రోజులకు పరిచయం పెరిగింది.

ముఖంపై స్ప్రే కొట్టి..

ఒకరోజు ఆమె బయటకు వెళ్దామని చెప్పడంతో సదరు వ్యక్తి కారులో తీసుకువెళ్లాడు. కార్ డ్రైవ్ చేస్తున్న సమయంలో జమీమా అతడి ముఖంపైనా, భుజం పైన ఏదో స్ప్రే చేసింది. అది ఏంటని అడగ్గా బాడీ స్ప్రే అని కవర్ చేసింది. కొంత సేపటికి అతడికి మత్తుగా అనిపించడంతో షాప్‌కు వెళ్లిపోయాడు. కొన్ని రోజుల తరువాత ఆమె తన ఇంటికి డిన్నర్‌కి రావాలని ఆహ్వానించింది. అతడు ఇంటికి వెళ్లగా జ్యూస్ తాగమని బలవంతం చేసింది. అది తాగిన కొద్ది సేపటికి మత్తులో జారిపోయాడు. మరుసటి రోజు మెలకువ రాగా.. ముందు రోజు సాయంత్రం వారు కలిసినప్పుడు క్లోజ్‌గా ఉన్న ఫొటోలను అతడికి చూపించింది. ఎందుకు ఫొటోలు తీశావని అడిగినా ఆమె సమాధానం చెప్పలేదు. అలా కొన్ని రోజులు ఫ్రెండ్లీగా ఉండేవారు.

పెళ్లిచేసుకోవాలని బెదిరింపులు

ఈ క్రమంలో పలుమార్లు తన ఫ్రెండ్ గెస్ట్ హౌస్‌కు రమ్మని చెప్పి తీసుకువెళ్లేది. అనంతరం అతడి భార్యకు విడాకులు ఇచ్చి తనను పెళ్లి చేసుకోవాలని బలవంతం చేయడం ప్రారంభించింది. పెళ్లి చేసుకోకపోతే ఇంతకు ముందు చాలా మందిపై రేప్ కేసులు పెట్టానని, అదే విధంగా ఇప్పుడు కేసు పెడతానని బెదిరించింది. అలాగే ఆమె గ్యాంగ్ సభ్యులు కూడా అతడిపై బెదిరింపులకు దిగారు. ఓసారి ఇంటికి వచ్చి చంపుతానని బెదిరించి సదరు వ్యక్తి ఫోన్ లాక్కుంది. అందులో ఉన్న కాంటాక్ట్స్, పర్సనల్ డేటాను, గూగుల్ లొకేషన్‌ను ఆమె ఫోన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసుకొని నిత్యం అతడిని ట్రాక్ చేస్తుండేది. ఒకరోజు అతడిని తన బెడ్‌రూమ్‌లో ఉన్న వాష్ రూమ్‌లో బంధించి పెళ్లి చేసుకోకపోతే అతడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అల్లరి చేస్తానని బెదిరించింది. దీంతో అతడు భయపడి నగరం వదిలి ఒడిశా పారిపోయాడు. అయితే తమ కుమారుడు కనిపించడం లేదని అతడి తల్లిదండ్రులు సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. జమీమా ఇప్పటికే సమాజంలో పలుకుబడి ఉన్న వారిని టార్గెట్ చేసి, హనీ ట్రాప్ చేసి వారి నుంచి బంగారం, డబ్బు, వాహనాలు లాక్కుంటున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ తరహా కేసులో భీమిలి పోలీసులు రెండు రోజుల క్రితం ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాధితుడు విశాఖకు వచ్చి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జమీమాతో పాటు ఆమె గ్యాంగ్‌పై పోలీసులు నిఘా పెట్టారు. వారి కోసం గాలిస్తున్నారు.

రంగంలోకి 'రింగ్'మేకర్లు

- వైన్‌షాపులకు ఎక్కువ దరఖాస్తులు రాకుండా ఒప్పందాలు
- జిల్లాలో చక్రం తిప్పుతున్న ముగ్గురు సిండికేట్లు
- 155 షాపులకు ఇప్పటివరకు 309 మంది మాత్రమే దరఖాస్తు
- ఒక్కో షాపునకు ఇద్దరు నుంచి ముగ్గురు మాత్రమే పోటీ
- 45 షాపులకు కనీసం ఒక దరఖాస్తూ రాకపోవడంపై అనుమానాలు

విశాఖ సిటీ: మద్యం దుకాణాల కోసం కూటమి ప్రజాప్రతినిధులు సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. నియోజకవర్గాల పరిధిలో కేటాయించిన షాపులను చేజిక్కించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. బయట వ్యక్తులెవరూ దరఖాస్తులు చేయకుండా సిండికేట్ల ద్వారా 'రింగ్'మేకర్లను రంగంలోకి దింపారు. దరఖాస్తు ఫీజు కూడా నష్టపోకుండా తెలివిగా రహస్య ఒప్పందాలతో సర్దేసుకుంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ముగ్గురు సిండికేట్లు చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. సిండికేట్‌లో లేనివారి దరఖాస్తులను స్వీకరించకూడదని ఎక్సైజ్ అధికారులపై ఒత్తిళ్లకు దిగుతున్నట్లు సమాచారం. వైన్‌షాపుల కోసం వచ్చిన దరఖాస్తుల సంఖ్యే ఈ వాదనలకు బలాన్ని చేకూర్చుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 309 దరఖాస్తులు మాత్రమే రావడం గమనార్హం.



రహస్యంగా 'రింగ్' ఒప్పందాలు

మద్యం దుకాణాల లాటరీ విధానం కూడా లోపభూయిష్టంగా కనిపిస్తోంది. ఇద్దరు టీడీపీ, ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలు ఈ వైన్‌షాపులను అనధికారికంగా బ్లాక్ చేస్తున్నట్లు మద్యం వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రధానంగా పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ, సిరిపురం, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, మురళీనగర్, గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, వన్‌టౌన్ ప్రాంతాల్లో పలు మద్యం షాపులను ఎమ్మెల్యేలు, వారి అనుచరులు చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఇక్కడ బయటి వ్యక్తుల నుంచి దరఖాస్తులు రాకుండా సిండికేట్ల ద్వారా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవానికి వైన్‌షాపుల కోసం ఆన్‌లైన్‌లో 800 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. కానీ ఇప్పటివరకు కేవలం 309 మంది మాత్రమే రూ.2 లక్షల డీడీ చెల్లించారు. మిగిలిన వారు డీడీ ఇవ్వకపోవడం వెనుక 'రింగ్ మేకర్లు' చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి వివరాలను 'పై స్థాయి' నుంచి సేకరించి వారితో బేరసారాలకు దిగి విరమింపజేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. 2019కి ముందు మాదిరిగా దరఖాస్తులు వెల్లువెత్తితే రూ.25 కోట్లు నుంచి రూ.30 కోట్లు వరకు దరఖాస్తు రుసుము కింద ఆదాయం సమకూరేది. కానీ ప్రస్తుతం ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం కేవలం రూ.9 కోట్లు వరకు మాత్రమే వచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఒక్కో దుకాణానికి 2, 3 దరఖాస్తులే..

విశాఖ జిల్లాలో 155 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఐదేళ్ల తరువాత ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు కేటాయిస్తుండడంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు వెల్లువెత్తుతాయని అందరూ భావించారు. గతంలో మాదిరిగా ఒక్కో వైన్‌షాప్‌కు 15 నుంచి 25 మంది వరకు పోటీ పడే అవకాశం ఉంటుందని అనుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా ఒక్కో దుకాణానికి రెండు నుంచి మూడు దరఖాస్తులు మాత్రమే రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జిల్లాలో 155 షాపులను లాటరీ ద్వారా కేటాయించేందుకు దరఖాస్తులు ఆహ్వానించగా.. ఇప్పటివరకు 110 షాపులకు కేవలం 309 మాత్రమే వచ్చాయి. 45 దుకాణాలకు ఒక్కరు కూడా దరఖాస్తు చేయకపోవడం విశేషం. దరఖాస్తుల సమర్పణకు కేవలం 2 రోజులు మాత్రమే సమయముంది.

మారిన రైళ్ల వేళలు



తాటిచెట్లపాలెం : విశాఖపట్నం చేరుకునే పలు రైళ్ల వేళలు ఆయా తేదీల నుంచి మారుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

- ఈ నెల 15వ తేదీ నుంచి న్యూఢిల్లీ-విశాఖపట్నం(20806) ఏపీ ఎక్స్‌ప్రెస్ విశాఖకు తెల్లవారు 4.10 గంటలకు బదులుగా 4.20 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 22 నుంచి లోకమాన్యతిలక్ టెర్మినస్-విశాఖపట్నం(22848) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తెల్లవారు 5 గంటలకు బదులుగా 5.10 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి హైదరాబాద్-విశాఖపట్నం (12728) గోదావరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తెల్లవారు 5.45 గంటలకు బదులుగా 5.55 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి కోర్బా-విశాఖపట్నం(18517) ఎక్స్‌ప్రెస్ ఉదయం 6.25 గంటలకు బదులుగా 6.40 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి సికింద్రాబాద్-విశాఖపట్నం (12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.40 గంటలకు బదులుగా 7.50 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి మచిలీపట్నం-విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.10 గంటలకు బదులుగా 8.20 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 20 నుంచి నాందేడ్ -విశాఖపట్నం (20812) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.10 గంటలకు బదులుగా 9.20 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి బ్రహ్మపూర్-విశాఖపట్నం (08531) పాసింజర్ స్పెషల్ ఉదయం 9.20 గంటలకు బదులుగా 9.30 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి కాకినాడ పోర్ట్-విశాఖపట్నం (17267) ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.30 గంటలకు బదులుగా 9.40 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 19 నుంచి భగత్ కి కోటి-విశాఖపట్నం (18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.50 గంటలకు బదులుగా 10 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి భవానిపట్న-విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్ ఉదయం 10 గంటలకు బదులుగా 10.10 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి గాంధీదాం-విశాఖపట్నం (20804) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.10 గంటలకు బదులుగా 10.20 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి దుర్గ్-విశాఖపట్నం (18529) ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.20 గంటలకు బదులుగా 10.30 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 20 నుంచి తిరుపతి-విశాఖపట్నం (22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.30 గంటలకు బదులుగా 10.40 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి లోకమాన్యతిలక్ టెర్మినస్-విశాఖపట్నం (18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.40 గంటలకు బదులుగా 10.50 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 20 నుంచి హజరత్ నిజాముద్దీన్-విశాఖపట్నం (12804)స్వర్ణజయంతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.15 గంటలకు బదులుగా 2.45 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి రాయ్‌పూర్-విశాఖపట్నం (08527) పాసింజర్ స్పెషల్ రాత్రి 6.40 గంటలకు బదులుగా 7 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రాత్రి 8.20 గంటలకు బదులుగా 8.45 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి గుణుపూర్-విశాఖపట్నం (08521) పాసింజర్ స్పెషల్ రాత్రి 8.45 గంటలకు బదులుగా 9 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 15 నుంచి సికింద్రాబాద్-విశాఖపట్నం (20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.31 గంటలకు బదులుగా 11.35 గంటలకు చేరుకుంటుంది.
- ఈ నెల 18 నుంచి కొల్లాం-విశాఖపట్నం (18568) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.40 గంటలకు బదులుగా 11.45 గంటలకు చేరుకుంటుంది.

నేడు స్టీల్‌ప్లాంట్‌పై ఢిల్లీలో కీలక సమావేశం

సాక్షి, విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ భవితవ్యంపై మంగళవారం ఢిల్లీలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో తీసుకోబోయే నిర్ణయంపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నాయి. వివిధ రాజకీయ పార్టీల నేతలను కలిసి ప్రైవేటీకరణ ఉపసంహరించాలని, స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, ముడిసరకుల హామీ కోసం సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. అదే విధంగా ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ నిలిపివేత, విద్యుత్ చార్జీల పెంపుదల వంటి అంశాలను వారి దృష్టికి తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఎంపీ భరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ హాజరవుతున్నట్టు సమాచారం. సమావేశంలో తమ భవిష్యత్తు కోసం తీసుకునే నిర్ణయంపై ఉద్యోగులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

సంతృప్తికర స్థాయిలో ప్రజా వినతుల పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ వర్మ

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు వచ్చే ప్రజా వినతులకు సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని, అవసరమైతే ప్రజలతో నేరుగా మాట్లాడాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేసులు రీ–ఓపెన్ కావడానికి వీలు లేదని పేర్కొన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో పాల్గొన్న ఆయన వివిధ అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్దిష్ట గడువులో ఆడిట్ నిర్వహించడంపాటు సమీక్షించుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు గ్రీవెన్స్ డే నాడు తప్పకుండా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, ప్రజల నుంచి వినతులు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సీఎంవోలో నమోదయ్యే ఫిర్యాదులపై కూడా నిర్దిష్ట కాలంలో చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ అంశాలపై అక్టోబర్ 31లోగా కౌంటర్ ఫైల్స్ దాఖలు చేసి నివేదిక అందించాలని సూచించారు.

208 ఫిర్యాదుల స్వీకరణ

సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు వివిధ సమస్యలపై 208 వినతులు సమర్పించారు. వాటిలో 91 రెవెన్యూవి కాగా, జీవీఎంసీకి చెందినవి 73, పోలీస్ విభాగానికి సంబంధించినవి 15, ఇతర శాఖలకు చెందినవి 29 ఉన్నాయి. కలెక్టర్‌తోపాటు, జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో పి.శ్రీలేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 77 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

జీవీఎంసీకి 75 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 వినతులు అందాయి. అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో జోన్–1కి 2, జోన్2కు 11, జోన్3కు 17, జోన్4కు 7, జోన్5కు 12, జోన్6కు 11, జోన్–8కి 4 ఫిర్యాదులు అందగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 11 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ. ప్రభాకరరావు, డీసీ(రెవెన్యూ) శ్రీనివాసరావు, డీడీహెచ్ దామోదరరావు, కార్యదర్శి బి.వి. రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అంకౌంట్స్ ఇ.వాసుదేవరెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్స లేకుండానే బ్రెయిన్ స్ట్రోక్‌కు వైద్యం

విమ్స్ డైరెక్టర్ రాంబాబు


బ్రెయిన్ స్ట్రోక్ నుంచి కోలుకున్న వృద్ధుడితో కలిసి మాట్లాడుతున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. విమ్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన 69 ఏళ్ల సీహెచ్ జగన్నాధరావుకు శస్త్ర చికిత్స లేకుండానే మందులతో నయం చేసినట్లు తెలిపారు. న్యూరో మెడిసిన్ వైద్యులు ఆయనకు చికిత్స అందించి రూ.55 వేల ఖరీదైన ఇంజక్షన్‌ను ఉచితంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో ఆయన వారం రోజుల్లో పూర్తిగా కోలుకున్నాడన్నారు. ఈ విధంగా చికిత్స అందించడం రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులలో ఇదే మొదటిదన్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనవారికి మూడు గంటలు గోల్డెన్ సమయమన్నారు. ఆ సమయంలో వైద్యులను సంప్రదించాలన్నారు. దానికి సంబంధించిన వైద్య సేవలు విమ్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. దీంతో పాటు ఇక్కడ మూడు నెలల్లో 1,016 ఎండోస్కోపీలు జరిగినట్లు తెలిపారు. ఎండోస్కోపిక్, కొలనోస్కోపీ, ఈఆర్‌సీపీ, ఎండో ఆల్ట్రాసోనోగ్రఫీ తదితర వాటిని చేయించడానికి ప్రైవేట్, కార్పొరేటర్ ఆస్పత్రులలో రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుందన్నారు. విమ్స్‌లో మాత్రం అవన్నీ ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగంలో క్లిష్టమైన సర్జరీలు జరుగుతున్నాయన్నారు. లేప్రోస్కోపీ ద్వారా లివర్ అండ్ బేరియాట్రిక్ తదితర సర్జరీలు జరుగుతున్నాయన్నారు. విమ్స్‌లో వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 22న విమ్స్‌లో బ్రెస్ట్ క్యాన్సర్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మెమోగ్రఫీ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. సమావేశంలో న్యూరో విభాగం వైద్యులు పాల్గొన్నారు.

నిధి పోర్టల్ ద్వారా ఏపీజీఎల్‌ఐ సేవలు

ఏపీజీఎల్‌ఐ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి

మహారాణిపేట: నిధి పోర్టల్ ద్వారా ఏపీజీఎల్‌ఐ (ఆంధ్రప్రదేశ్ సాధారణ జీవిత బీమా) సేవలను పొందాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీజీఎల్‌ఐ సంయుక్త సంచాలకులు ఎం. ఝాన్సీలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ, అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీజీఎల్‌ఐ జీవిత బీమా సేవలు అందిస్తోందని గుర్తు చేశారు. దానిలో భాగంగా మే నెల 24 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ సేవలు ఆఫ్‌లైన్ నుంచి నిధి పోర్టల్‌కు బదలాయింపు జరిగాయని, ఈ విషయాన్ని పాలసీదారులు గుర్తించాలని సూచించారు. మే 24 నుంచి నేటి వరకు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో గల ఏపీజీఎల్‌ఐ పాలసీదారులకు చెందిన 1,368 పరిణితి, మరణ క్లెయిమ్‌లు, 503 రుణ దరఖాస్తులను ఆమోదించి వారి డీడీవోల నిధి పోర్టల్ లాగిన్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. డీడీవోలు నిధి పోర్టల్ లాగిన్‌కు వచ్చిన ఆమోదిత క్లెయిమ్‌లు, రుణ చెల్లింపుల కోసం సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లు జనరేట్ చేసి, సబ్మిట్ చేయవలసి ఉందన్నారు. అదేవిధంగా ఉద్యోగి బేసిక్ పే శ్లాబ్ రేట్ ప్రకారం మొదటి పాలసీ బాండ్‌ను వారి కార్యాలయ డీడీవో నిధి లాగిన్‌లో మాత్రమే జనరేట్ చేయాలని వారి ప్రీమియంను మొదట నెల జీతం బిల్లులో రికవరీ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే ఏపీజీఎల్‌ఐ కార్యాలయం త్వరలోనే జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమర్షియల్ కాంప్లెక్స్ భవనానికి మారనుందని పేర్కొన్నారు.

బాల్య వివాహాలకు పాల్పడితే జైలే

మహారాణిపేట: ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ హితవు పలికారు. బాల్య వివాహాల చట్టం –2006 ప్రకారం 18 ఏళ్లలోపు ఆడ పిల్లలకు, 21 ఏళ్ల లోపు మగ పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా, హాజరైనా నిందితులే అవుతారని హెచ్చరించారు. ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే రెండేళ్ల జైలు, జరిమానా విధిస్తారని, నాన్ బెయిల్ బుల్ కేసు పెడతారని చెప్పారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హాలులో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఐసీడీఎస్ పీడీ జయదేవిలతో కలిసి కలెక్టర్ పోస్టర్ ఆవిష్కరించారు.


పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్ అశోక్

సంతానలక్ష్మిగా కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు సోమవారం సంతానలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కలువపూలతో పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం విజయలక్ష్మిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారని, గులాబీ పూలతో పూజ నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు.

విలాసాల కోసం దొంగతనాలు

సీతమ్మధార: చెడు అలవాట్లకు బానిసయ్యాడు. విలాసాల కోసం దొంగగా మారాడు. పార్క్ చేసిన ఉన్న ద్విచక్రవాహనాలు, ఆటోలు అపహరించడం.. వాటిని అమ్మేయడం వచ్చిన డబ్బులతో జల్సాలు చేయడం పరిపాటిగా మార్చుకున్నాడు. ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు..కటకటాల పాలయ్యాడు. ద్వారకా పట్టణ క్రైం స్టేషన్‌లో ఏడీసీపీ (క్రైమ్) ఎం.మోహనరావు సోమవారం ఏసీపీ వెంకటరావుతో కలిసి వివరాలు వెల్లడించారు. కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన రాయుడు నరసింహమూర్తి (39) విశాఖలోని సీతంపేట ప్రాంతంలో ఫుట్‌పాత్ మీద ఉంటున్నాడు. అతడు చల్లపల్లి ప్రసాద్‌తో కలిసి వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ ఏడాది జూలై ఏడో తేదీన సీతంపేట రోడ్డులో పార్కింగ్ చేసి ఉన్న బైక్ చోరీ చేశాడు. బైక్ పోగొట్టుకున్న సీతంపేటకు చెందిన గులివిందల రాజు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీఎస్–2 ఇన్‌చార్జి, ద్వారకా సబ్ డివిజన్ క్రైం సీఐ రామారావు, ద్వారకా క్రైమ్ ఎస్ఐ ఎస్. రాజుతో కూడిన బృందం సోమవారం సీతంపేట దుర్గాగణపతి దేవస్థానం వెనుక నిందితుడిని చాకచక్యంగా అరెస్టు చేశారు. అతడి వద్ద మూడు బైకులు, నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు ఏడీసీపీ (క్రైమ్) ఎం.మోహనరావు తెలిపారు. గురుద్వారా వద్ద ఆటో, సంగమ్–శరత్ జంక్షన్ వద్ద ఆటో, జైలు రోడ్డు వద్ద ఒక బైక్, బీచ్‌రోడ్డులో ఒక బైక్, ఏకేసీ కాలనీలో ఒక ఆటో, కాకినాడలో ఒక ఆటో చోరీ చేశారని దర్యాప్తులో తేలిందన్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని సీపీ శంఖబ్రత బాగ్చి అభినందించారని ఆయన తెలిపారు.

కుమార్తె మృతిని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య


మృతి చెందిన సింహాద్రి

పద్మనాభం: కుమార్తె మృతిని తట్టుకోలేక మద్యానికి బానిసైన తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పద్మనాభం ఎస్ఐ జె.సురేష్ అందించిన వివరాలు. మండలంలోని బాందేవపురానికి చెందిన బోనెల సింహాద్రి కుమార్తె కోటలక్ష్మి నాలుగు నెలల క్రితం పాముకాటుకు గురై మృతి చెందింది. కుమార్తె మృతితో తీవ్ర మనోవేదనకు గురైన తండ్రి బోనెల సింహాద్రి(41) మద్యానికి బానిసై ఈ నెల 4వ తేదీన పురుగుల మందును తాగాడు. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 4 గంటల సమయంలో మృతి చెందాడు. దీనిపై ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏపీపీల నియామకానికి చర్యలు

విశాఖ లీగల్: జిల్లాలో వివిధ న్యాయస్థానాల్లో పబ్లిక్ ప్రాసెక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్లు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ల నియామకానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియ నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

ప్రజా ఉద్యమ కేంద్రంగా ఏచూరి స్మారక భవనం


శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు

మద్దిలపాలెం: సీపీఎం దిగ్గజం దివంగత సీతారాం ఏచూరి పేరుమీద ప్రజా ఉద్యమ కేంద్రం (పార్టీ కార్యాలయం) నిర్మించడం అభినందనీయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నా రు. మద్దిలపాలెం కళాభారతి వద్ద సీపీఎం జిల్లా కార్యాలయ నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో జరిగిన ఎన్నో ఉద్యమాలకు సీతారాం ఏచూరి ఊపిరిపోశారన్నారు. దేశంలోనే మొదటి సారిగా ఆయన పేరుమీద స్మారక భవనం నిర్మిస్తుండడంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు సీహెచ్ నర్సింగరావు, ఎంవీఎస్ శర్మ, వీఎస్ పద్మనాభ రాజు,సీపీఎం కార్పొరేటర్ డాక్టర్. బి గంగారావు , సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఆర్.కె. ఎస్.వి. కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

ఎమ్మెల్యే కొణతాలపై మాటల 'దాడి'



సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి నియోజకవర్గంలో టీడీపీ–జనసేన మధ్య విభేదాలు బయటపడ్డాయి. సుదీర్ఘ రాజకీయాల్లో శత్రువులుగా విమర్శలు చేసుకునే కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావుల మధ్య స్నేహం పట్టుమని మూడు నెలలు కూడా లేనట్టుగానే స్పష్టమైంది. సోమవారం అనకాపల్లి గవరపాలెంలో జరిగిన టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణపై దాడి వీరభద్రరావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

అనకాపల్లి నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అల్లుడు చెప్పిందే వేదంగా మారిందంటూ దాడి వీరభద్రరావు విరుచుకుపడ్డారు. అనకాపల్లిలో జనసేన ప్రభుత్వం నడుస్తుందా..? లేదంటే కూటమి ప్రభుత్వం నడుస్తుందా..? కొణతాల రామకృష్ణ అల్లుడు రాజకీయం చేయడమేంటి..? అని మండిపడ్డారు. కూటమిలో భాగంగా ఎన్నికల్లో సీటు జనసేనకు వచ్చింది..టీడీపీ నుంచి పీలా గోవింద్ సత్యనారాయణ సీటును త్యాగంచేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని దించాలనే లక్ష్యంతో అందరం కలిసికట్టుగా పనిచేశామన్నారు. కానీ అనకాపల్లిలో జనసేన ఎమ్మెల్యే కుటుంబం పాలిస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంది..చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం నడుస్తోంది. ఇందులో ప్రధాన పార్టీ టీడీపీ అనే విషయాన్ని మరిచిపోవద్దు అన్నారు. తాను గతంలో కలెక్టర్‌ను కలిసి ఇదే విషయం చెప్పానని, టీడీపీ నేతలు చెప్పిన విధంగానే నడుచుకోవాలని తెలిపానన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు వివిధ విభాగాల్లో ఉన్న అధికారులంతా జనసేన ఎమ్మెల్యే, వారి కుటుంబ సభ్యులు చెప్పినట్లే వింటున్నారు తప్ప టీడీపీ నేతలు చెప్పినట్టు వినడం లేదని మండిపడ్డారు. దీనికి ఏపీఎఫ్ఐడీ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్,టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్‌లు మద్దతు పలికారు.

అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయి పట్టివేత

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 50 కేజీల గంజాయితో పాటు 8 మంది యువకులను దువ్వాడ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం పాడేరు, ముంచింగిపుట్టు ప్రాంతాల నుంచి 50 కేజీల గంజాయిని రాజీవ్‌నగర్‌లో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని నిల్వ ఉంచారు. వీటి విలువ సుమారు రెండున్నర లక్షల వరకు ఉంటుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల కబడ్డీ పోటీల విజేత విశాఖ


మొదటి స్థానం సాధించిన విశాఖ జట్టు

ఎచ్చెర్ల క్యాంపస్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం వేదికగా ఆది, సోమవారాల్లో జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి 13 జట్లు 156 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో విశాఖ ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ స్థానాలు సాధించాయి. శ్రీకాకుళం జిల్లా జట్టు మూడోస్థానానికి పరిమితమైంది. ఉత్తమ ప్రదర్శన ఆధారంగా 16 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు.

వలంటీర్ల సమస్యలు పరిష్కరించండి


నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

మహారాణిపేట: ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని వలంటీర్లు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాయంలో జేసీ మయూర్ అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గ్రామ,వార్డు వలంటీర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.జగదీష్ డిమాండ్ చేశారు. అదే విధంగా వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.